(2) అలుక్సమాసాలు, (3) లుగలుక్సమాసాలు అని మూడు విధాలుగా విభజించాడు.

## 3.10.1 సమాసం:అర్థనిర్ణయం

సమాసాల అర్థాలను విగ్రహ వాక్యాలనుంచి సాధించటం నియతంగా వస్తున్న వ్యాకరణ సంప్రదాయం. సమాసాల అర్థాన్ని లౌకిక విగ్రహవాక్యం బోధిస్తుంది. అయితే - సాధ్య, మిశ్ర, ఆచ్ఛిక ...వంటి సమాసాలను లౌకిక విగ్రహ వాక్యాలతో సాధించలేం. ఇటువంటి సమాసాల సాధనకు అలౌకిక విగ్రహ వాక్యాలను వ్యాకర్తలు కల్పించారు.

## 3.10.2 సమాస విభజన

"సమాసాలను ఉత్పత్తినిబట్టీ, అవయవపదాలకు పరస్పరం ఉండే సంబంధాన్ని బట్టి రెండు రకాలుగా విభజించవచ్చు. ఉత్పత్తినిబట్టి సమాసాలను (1) దేశి (కేవల దేశ్య ప్రాతిపదికలతో ఏర్పడేవి) (2) తత్సమం (సంస్కృతం నుంచి యథా తథంగా గ్రహించినవి) (3) మిశ్రం (తత్సమ, దేశ్యాల సమ్మేళనంవల్ల ఏర్పడేవి) అని మూడు రకాలుగా విభజించవచ్చు...(ఇది చిన్నయసూరి సమాస విభజన (చూ. బాలవ్యా. సమాస.:2) వంటిది.)

సమాసంలో అవయవ పదాలకుండే పరస్పర సంబంధాన్ని బట్టి సమాసాలను ప్రధానంగా మూడు విభాగాలు చేయవచ్చు. (1) అంతః కేంద్రకాలు (endocentric); కర్మధారయ, ద్విగు, తత్పురుష సమాసాలు ఈ విభాగంలో చేరుతాయి. ... (2) బహిః కేంద్రకాలు (exocentric); బహువ్రీహి సమాసం... (3) ద్వంద్వ సమాసం (co-ordinative)." అని ఉత్పత్తిని, సమాస అవయవ పదాల సంబంధాన్ని బట్టి విభజన చేసి చూపినవారు రంగనాథాచార్యులు (1979: 187, 188).

ఈ అధ్యయనంలో శ్రీరామాయణం కావ్యంలోని సమాసాలు సాంస్కృతికాలు, ఆచ్ఛికాలు, మిశ్రాలు అనే స్థూల విభజననుబట్టీ, (వాటిలోని అవయవ నిర్మాణాన్నీ) కారక సంబంధాన్ని బట్టీ అనుశీలించబడ్డాయి.

### 3.10.2.1 సాంస్కృతిక సమాసాలు

సాంస్కృతిక సమాసాలు రెండు విధాలు. (1) సిద్ధ సాంస్కృతిక సమాసాలు (2) సాధ్య సాంస్కృతిక సమాసాలు.

## 3.10.2.1.1 సిద్ధ సాంస్కృతిక సమాసాలు

సంస్కృతంలో ఏర్పడిన సమాసాలకి తెలుగులో తత్తత్ప్రత్యయాలు చేరి ఏర్పడేవి సిద్ధ సాంస్కృతిక సమాసాలు. ఇలాంటి సమాస రచన శ్రీరామాయణంలో "వర్ణన"ల్లో కనిపిస్తుంది. (శ్రీరాముడు గంగా తీరం చేరే సందర్భంలో)

"కాంచన దళరత్న-కందళకర్ణి
కాంచిత కమలవ-నాభి శోభితము
మకరంద రసలోల-మదచంచరీక
నికర గాయన గాన-నిబిడీ కృతంబు
శౌనకాదిమ మహా-సంయమి శ్రేష్ఠ
మానితాశ్రమ లస-మాన కూలంబు
మానిత సురత సం-భ్రమ రణదివిజ
మీనేక్షణా మణీ-మేఖలారవము
కలితలతా డోలి-కాలోల మౌని
కులకన్యకాతులా-కోటిస్వనంబు
పనస రసాల రం-భానారికేళ
తినిశక్రముక వనో-త్కీణ రోదంబు
వారి కేళీలోల-వైమానికాభి
సారికావీక్షా మృ-షా మీనబలము
యాజన హోమధూ-మా కాండజలద
రాజకాచ్ఛన్న త-రంగ మాలికము
కారండవమరాళి-కాప్లవీభూత
గౌర సారస పరా-గ ప్రపంచంబు..." (2:4983-5000)

## 3.10.2.1.2 సాధ్య సాంస్కృతిక సమాసాలు

సంస్కృత పదాలు తత్సమాలతో సమసించి సాధ్య సాంస్కృతిక సమాసాలు ఏర్పడతాయి.

## 3.10.2.2 ఆచ్ఛిక సమాసాలు

తద్భవ, దేశ్యపదాలు కలిసి ఆచ్ఛిక సమాసాలు ఏర్పడతాయి. వాటి అవయవ నిర్మాణం (i) దేశ్య+దేశ్య (ii) దేశ్య+తద్భవ (iii) తద్భవ+దేశ్య (iv) తద్భవ+తద్భవ రూపాలలో ఉంటుంది.

(i) దేశ్య+దేశ్య

అలంతి-నవ్వు (1:4471)
చిఱు-నవ్వు (6:822)
వెన్నెల-తేట(6:701)

(ii) దేశ్య+తద్భవ

నెమ్మొగంబు (1:89)
తొలుసంజ (4:5872)

(iii) తద్భవ+దేశ్య

జముని ముక్కు (3:2551)

(iv) తద్భవ+తద్భవ

రాయంచ(5:591)
అడియాస (2:3867)

## 3.10.2.3 మిశ్ర సమాసాలు

అవయవ నిర్మాణాన్ని అనుసరించి మిశ్ర సమాసాలను(i)సంస్కృతసమ+ దేశ్య, (ii)దేశ్య+ సంస్కృతసమ, (iii)సంస్కృతసమ+తద్భవ, (iv)తద్భవ+ సంస్కృత సమాలుగా విభజించవచ్చు.

(i) సంస్కృతసమం+దేశ్యం

భర్తమాటలు(4:3677)
వజ్రాంగి చాడ్పున(4:6170)

(ii) దేశ్యం+సంస్కృతసమం

వాని భామిని(1:2204)
నిండు ప్రాణము (4:5602)

(iii) సంస్కృతసమం+తద్భవం

బ్రహ్మయానతి (6:7242)
ధాతయానతి(1:3381)

(iv) తద్భవం+సంస్కృతసమం

కపురభాగము (6:1148)
చుక్కలరాజు(4:177)

## 3.10.2.4 వైరి సమాసాలు

సమాస పదాల్లో మొదటిది సంస్కృత పదం, రెండోది తెలుగు పదం అయినపుడు వైరి సమాసాలు ఏర్పడతాయి. వీటిని తెలుగు వ్యాకర్తలు నిషేధించారు.

కనక తప్పెటలు (1:1299)
"కనక తప్పెటలు శం-ఖములును..."

## 3.10.3 కారక సంబంధం ఆధారంగా సమాస విభజన

కారక సంబంధం ఆధారంగా సమాసాలను మూడు రకాలుగా (చూ. బాలవ్యా. సమాస.:3) విభజించవచ్చు.

(i) తత్పురుష, కర్మధారయం, ద్విగువు= నిర్ధారక సమాసాలు(determinative)
(ii) బహువ్రీహి (సంబంధ తత్పురుష) (possessive)
(iii) ద్వంద్వం (సంయోజక సమాసం) (copulative)

## 3.10.3.1 తత్పురుష

సాధారణంగా ఉత్తర పదార్థ ప్రధానమై ఉంటుంది.

మాటనేర్పు(4:3705)
సేనల రవళి(6:4787)
అనలుని వేఁడిమి (3:3313)

కొన్నిచోట్ల పూర్వపదం ఏకాక్షరంగా కనిపిస్తుంది.

మై పూఁత (6:1089)
పూదోట (2:6847)

## 3.10.3.2 కర్మధారయం

కర్మధారయ సమాసంలో సాధారణంగా విశేషణం మొదటి పదంగానూ, విశేష్యం రెండో పదంగానూ ఉంటుంది.

అడియాస (2:3867)
బెబ్బులి (4:2645)

## 3.10.3.3 ద్విగువు

ఈ సమాసంలో సంఖ్యావిశేషణం పూర్వ పదంగా ఉంటుంది.

ఒకమాట (1:81)
నలుదెసలు (3:1846)
నలుదిక్కులు(6:9290)
ఆఱుమోములు(1:3014)
ఆఱు శరములు (6:4037)

## 3.10.3.4 బహువ్రీహి

అన్యపదార్థ ప్రాధాన్యత కలిగినది బహువ్రీహి సమాసం.

పూఁబోడి (4:6009)
పచ్చవిల్తుడు (5:1690)
ముక్కంటి (3:4076)

3.10.3.5 ద్వంద్వం

ఉభయ పదార్థ ప్రాధాన్యత కలిగినది ద్వంద్వ సమాసం.

తల్లిదండ్రులు(1:4454)
తలిదండ్రులు(3:3287)
ఆలుబిడ్డలు(2:7303)
అన్నదమ్ములు(6:1311)

## 3.11 ఇతర విశేషాలు

*శ్రీ రామాయణం* కావ్యంలో సందర్భానుసారంగా వ్యవహారంలో ఉన్న పదాలను వరదరాజు ప్రయోగించాడు. వీటిని నాలుగు సంపుటులుగా వెలువడిన *శ్రీ రామాయణ* కావ్య పీఠికలలో (చూ. *శ్రీ రామాయణం* 1-4సంపుటులు. 1950-1953) నిడుదవోలు వేంకటరావుగారు ప్రస్తావించారు.

ఉదా.

1 కవి కి తుల్యంగా 'కబ్బి' (కవి శబ్ద భవం) (1:47)
2 సిందూరము అనే అర్థంలో 'చింద్రెంబు' ప్రయోగం (1:92)
3 గృహమునకు సమానార్థంలో 'నికేతము' అనే ప్రయోగం (1:520)
4 దుఃఖ శబ్ద తద్భవరూప-'దుక్కంబు'- ప్రయోగం (1:696)
5 ఏనుగులు నివసించే ప్రాంతానికి 'సజ్జారము' అనే ప్రయోగం (సజ్జారము<సామజాగారము) (1:935)
6 మంచినీటి తిత్తులు/సంచులకు సమానార్థంలో 'తన్నీరు తిత్తులు' (2:75)
7 పట్టపుదేవికి సమానార్థంలో 'పెద్దరాణివాసము' (2:289)
8 కుప్పసము రూపాంతరం 'కుపసము' (2:4547)

9 పల్లకీలపై పరిచే గుడ్డలు అనే అర్థంలో 'దిడ్లు' (2:2627)
10 మిద్దెటిల్లుకు సమానార్థంగా 'మచ్చులు' (2:3561)
11 దోయిట శబ్ద రూపాంతరం 'డోయిట' ప్రయోగం (2:3780)
12 హజార శబ్ద రూపాంతరమైన 'అజార' శబ్ద ప్రయోగం (2:5739)
13 కుక్కలనే అర్థంలో 'గ్రామ సింహములు' (2:6748)
14 శత్రురాజుకు సమానార్థంలో 'గడిరాజు' (2:9241)
15 మిత్రుడైన రాజుకు సమానార్థంలో 'కడిరాజు' (2:9241)
16 నిజము అనే అర్థంలో 'నిబద్ది' (2:9646)
17 దీవన శబ్ద రూపాంతరం 'దీవెన' (2:9804)
18 పంక్తి భోజనముకలవారికి సమానార్థంలో 'కడివారు' (4:254)
19 వర్షము శబ్ద రూపాంతరం 'వరుషము' ప్రయోగం (4:2676)
20 జడ లేక కొప్పు అనే అర్థంలో 'చాడె' (6:8050)
21 ఒడలు రూపాంతర శబ్దం 'ఒళ్ళు' ప్రయోగం (6:12030)

* * *

# 4 క్రియారూప విజ్ఞానం

(Verb Morphology)

## 4.0 క్రియ-నిర్వచనం

ఈ అధ్యాయంలో ప్రాతిపదిక అనే పదం అంగ్లంలోని 'base' అన్న మాటకు సమానార్థకంగా వాడబడింది. కాల, అవస్థ, ఇచ్ఛ ప్రత్యయాలను కలిగిన రూపం క్రియ. క్రియా ప్రాతిపదికలు కాల, అవస్థ, ఇచ్ఛ ప్రత్యయాలను గ్రహిస్తాయి. క్రియా రూపాలు క్రియా ప్రాతిపదిక (verbal base)ల నుంచి ఏర్పడతాయి. క్రియా ప్రాతిపదిక కేవలం ధాతు (root) రూపంలోగానీ, దానిమీద ప్రత్యయం లేక అనుబంధం చేరిన రూపంలోగానీ ఉండవచ్చు.


## 4.1 క్రియా ప్రాతిపదికల వర్గీకరణ

ఈ అధ్యాయంలోని క్రియా ప్రాతిపదికల వర్గీకరణకు రామనరసింహం (2001:21, 22) చేసిన క్రియా ప్రాతిపదికల వర్గీకరణ ఆధారం. క్రియా ప్రాతిపదికను స్థూలంగా సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త క్రియా ప్రాతిపదికలుగా విభజించవచ్చు. తర్వాత సామాన్య క్రియా ప్రాతిపదికలలోని సిద్ధ అకర్మకాలను, సిద్ధ సకర్మకాలను వేరుచేయాలి. సిద్ధ అకర్మక క్రియా రూపాలలో సకర్మకాలుగా మార్చదగిన రూపాలూ, సకర్మకాలుగా మార్చలేని రూపాలూ ఉంటాయి.

సంశ్లిష్ట క్రియా ప్రాతిపదికలను సాధ్య సకర్మకాలు, ప్రేరణార్థకాలు అనే రెండు ప్రధాన విభాగాలుగా విభజించవచ్చు. సాధ్య సకర్మకాలలో సిద్ధ అకర్మక రూపాలనుంచి నిష్పన్నమైన క్రియా రూపాలను ఒక విభాగంగా, నామ ప్రాతిపదికలనుంచి నిష్పన్నమైన క్రియారూపాలను మరో విభాగంగా వేరుచేయవచ్చు.

సంయుక్తక్రియా ప్రాతిపదికలలో ఇటువంటి ఉపవిభాగాల ప్రసక్తి ఉండదు.

పక్క పుటలోని రేఖాచిత్రం ఇంతవరకూ చర్చించిన ప్రధాన ఉప విభాగాలను సూచిస్తుంది.




## 4.1.1 సామాన్య క్రియా ప్రాతిపదిక (simple verbal bases)

ఇది కేవలం ధాతువు. (ఏకపదాంశ ఘటితమై ఉంటుంది.)

అద్దు (1:1180)
అమరు (2:8336)
అరుగు (1:2408)

## 4.1.1.1 సిద్ధ అకర్మక క్రియా ప్రాతిపదికలు

ఇవి స్వతఃసిద్ధంగా అకర్మకాలు.

చిందు (2:3229)
తోఁచు (2:5226)

వీటిలో సకర్మకాలుగా మార్చదగినవి, మార్చలేనివీ ఉంటాయి.

### 4.1.1.1.1 సకర్మకాలుగా మార్చదగినవి

సిద్ధ అకర్మక క్రియా ప్రాతిపదికలు -చు, -పు, -ఇంచు అనే ప్రత్యయాలను గ్రహించి సకర్మకాలుగా మారతాయి.

చేరు (6:11384)
తీరు (5:3667)
దాఁటు (4:5593)

### 4.1.1.1.2 సకర్మకాలుగా మార్చలేనివి

ఇవి సకర్మకాలుగా మారవు. అకర్మకాలుగానే ప్రవర్తిల్లుతాయి.

వందురు (1:551)
వేగు (4:3070)

## 4.1.1.2 సిద్ధ సకర్మక క్రియా ప్రాతిపదిక

సిద్ధ సకర్మక క్రియా ప్రాతిపదికలలో చేరే రూపాల సకర్మకత ధాతుగతమైనది.

కట్టు (1:2510)
నవ్వు (2:6668)

## 4.1.2 సంశ్లిష్ట క్రియా ప్రాతిపదికలు (complex verbal bases)

ఆచ్ఛిక, తత్సమ ధాతువులకు -ఇంచు, -ఇల్లు/-ఇలు, -చు, -పు అనే ప్రత్యయాలు చేరి సంశ్లిష్ట క్రియా రూపాలు ఏర్పడతాయి. వీటిలో -ఇంచు ప్రత్యయాంత ప్రాతిపదికలు సకర్మ కాకర్మక రూపాలలో ఉంటాయి. -ఇల్లు/-ఇలు ప్రత్యయాంత ప్రాతిపదికలు నిత్య అకర్మకాలుగా ప్రవర్తిల్లుతాయి. -చు, -పు ప్రత్యయాంత ప్రాతిపదికలు సకర్మ కాకర్మక రూపాలలో ఉంటాయి.

సంశ్లిష్ట క్రియా ప్రాతిపదికలను సాధ్య సకర్మక ప్రాతిపదికలు, ప్రేరణార్థకాలు అని రెండు రకాలుగా విభజించవచ్చు.

## 4.1.2.1 సాధ్య సకర్మక క్రియా ప్రాతిపదికలు

సిద్ధ అకర్మక రూపంనుంచి నిష్పన్న మైనవి, నామప్రాతిపదికలనుంచి నిష్పన్న మైనవి అనే భేదాలతో ఇవి రెండు రకాలు.

### 4.1.2.1.1 సిద్ధ అకర్మక రూపంనుంచి నిష్పన్నమైనవి

ఆచ్ఛిక సిద్ధ అకర్మక రూపాలపై -చు, -ఇంచు, -పు అనే ప్రత్యయాలు చేరి ఇవి ఏర్పడతాయి.

తీర్చు (2:9097)
అలరించు (2:1364)

### 4.1.2.1.2 నామ ప్రాతిపదికలనుంచి నిష్పన్నమైనవి

ఆచ్ఛిక సిద్ధ అకర్మక రూపాలకు -ఇంచు, -ఇల్లు/-ఇలు అనే ప్రత్యయాలు చేరి ఏర్పడతాయి.

కౌఁగిలించు (3:3417)
ఉల్లసిల్లు (3:1348)

## 4.1.2.2 ప్రేరణార్థక క్రియా ప్రాతిపదికలు

సకర్మక, అకర్మక రూపాలపై -ఇంచు ప్రత్యయం చేరి ఇవి ఏర్పడతాయి.

చేయించు (6:993)
విడిపించు (6:1197)

## 4.1.3 సంయుక్త క్రియా ప్రాతిపదికలు (compound verbal bases)

అసమాపక క్రియా రూపాలమీద సహాయక క్రియలుచేరి సంయుక్త క్రియా ప్రాతిపదికలు ఏర్పడతాయి.

## 4.1.3.1 వర్తమాన అసమాపక క్రియ+సహాయక క్రియ

ధాతువుకు -చున్ అనే ప్రత్యయం చేరి వర్తమాన అసమాపక క్రియారూపాలు ఏర్పడతాయి. వీటిపై "ఉండు" అనే సహాయక క్రియ చేరి కింది విధమైన రూపాలు ఏర్పడతాయి.

చూచుచునుండు (6:5756)
కనుచుండు (2:2211)

## 4.1.3.2 క్త్వార్థ క్రియా విశేషణం+సహాయక క్రియ

క్రియాధాతువుమీద 'ఇ'చేరి ఏర్పడే క్త్వార్థ క్రియా విశేషణాలమీద సహాయక క్రియలుచేరి సంయుక్త క్రియా రూపాలు ఏర్పడుతున్నాయి.

(i) రెండంశాల సంయుక్త రూపాలు:

| | |
|---|---|
| -ఉండు: | పడియుండు (2:3657) |
| -పోవు: | తొలఁగిపోవు (3:4154) |
| -వైచు: | నఱికివైచు (6:556) |

## 4.1.3.3 వ్యతిరేక అసమాపక క్రియ+సహాయక క్రియ

ధాతువుపై '-అక' ప్రత్యయం చేరటం వల్ల వ్యతిరేక అసమాపక క్రియలు ఏర్పడతాయి. వీటికి సహాయ క్రియలు కలవడంవల్ల వ్యతిరేక అసమాపక సంయుక్త క్రియా రూపాలు ఏర్పడతాయి.

(i) రెండంశాల సంయుక్త రూపాలు:

ఊరకయుండు (2:7629)
ఎడబాయకుండు (2:3364)

### 4.1.3.4 అన్నంతం+సహాయక క్రియ

ధాతువుపై '-అన్' అనే ప్రత్యయం చేరి అన్నంత రూపాలు ఏర్పడతాయి. ఈ అన్నంత రూపాలమీద సహాయక క్రియలు చేరితే సంయుక్త అన్నంత క్రియా రూపాలు ఏర్పడతాయి.

(i) రెండంశాల సంయుక్త రూపాలు:

-వచ్చు:ఓర్వవచ్చు (4:874) ("...ఎ(నె)టులోర్వవచ్చు)
-కొట్టు: వెడలఁగొట్టు (4:846 తర్వాతి వచనంలో)

(ii) మూడంశాల సంయుక్త రూపాలు:

-చాలు: పగదీర్పఁజాలు (1:4135)

# 4.2 కాల-భావబోధక ప్రత్యయాలు

## (Tense-Mode Suffixes)

కాల-భావబోధక ప్రత్యయాలు క్రియాధాతువులపై చేరి కొన్ని మార్పులు కలిగిస్తాయి. వీటిని మూడు తరగతులుగా విభజించి వివరించినవారు ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి(1972:203). ఈ విధమైన విభజన పద్ధతే ఈ అధ్యయనంలో గ్రహించబడింది.

## 4.2.1 ప్రత్యయ విభజన

### 4.2.1.1 మొదటి తరగతి- హలాది ప్రత్యయాలు

1) -చున్: శత్రర్థకం (present participle)

2) -చ్- : వర్తమానకాల ధాతుజ విశేషణం (bound present participle)

3) -త- : విధ్యాశీరర్థకం(ప్ర.పు.ప్రత్యయాలముందు) (imperative-benedictive)